నోరూరిస్తున్న ఐస్‌క్రీమ్



మంచిర్యాలటౌన్: ఎండలు మండిపోతున్నాయి... అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు జ్యూస్‌లు, లస్సీ, మజ్జిగలతో పాటు ఐస్‌క్రీమ్ తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వేసవికి ముందు నుంచే ఐస్‌క్రీమ్ బండ్లు వాడల్లో తిరుగుతూ అమ్మే ఐస్‌క్రీమ్‌లకు తోడు కొత్తగా ఐస్‌క్రీమ్ పార్లర్లు వెలుస్తున్నాయి. దీంతో ప్రజలకు నచ్చిన రుచిని అందించేందుకు గాను కొత్తకొత్త రకాలతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. సీజన్‌లో దొరికే పండ్లతో పాటు, అన్ని రకాల డ్రై ఫ్రూట్స్‌తో తయారు చేసే ఐస్‌క్రీమ్‌లు, చాకోలేట్ ఐస్‌క్రీమ్‌లు, స్టోన్‌లైవ్ ఐస్‌క్రీమ్‌ల పేరిట తయారుచేసి అందిస్తున్నారు. దాదాపు 40రకాల ఫ్లేవర్లలో లభించేలా ఆయా ఐస్‌క్రీమ్ పార్లర్లలో అందుబాటులో ఉంచి, ఎవరి టేస్టుకు నచ్చినట్లుగా ఆయా ఐస్‌క్రీమ్‌లను అందిస్తున్నారు.

- మార్కెట్‌లో అందుబాటులో వివిధ రకాల ఐస్‌క్రీమ్‌లు
- వేసవి కావడంతో పెరిగిన డిమాండ్

సండే స్పెషల్





సీజన్‌లో దొరికే పండ్లతో పాటు, అన్ని రకాల పండ్లకు సంబంధించిన వాటితో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నారు. ఇందులో కర్బూజ, మామిడి, సపోట పండ్లతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లను ఎక్కువగా తింటున్నారు. స్ట్రాబెర్రీ, పైనాపిల్, సీతాఫల్, లిచ్చి, ఆరెంజ్, మిక్స్‌డ్ ఫ్రూట్, రోజ్ పెటల్స్, పిస్తా వంటి రకాలతో చేసినవి అందుబాటులో ఉన్నాయి. డ్రైఫ్రూట్స్, డ్రైఫ్రూట్ డిలైట్స్, క్యారనల్ నట్స్, హనిమూన్ డిలైట్, రాజ్‌భోగ్, మావమలై కుల్ఫి, అంజీర్ బాదం, బటర్‌స్కాచ్ నట్స్‌తో చేసిన వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక చాకోలేట్ ఫ్లేవర్‌లో రియల్ చాకోలేట్, జామైకాన్ చాకో ఫడ్జ్, బెల్జియం డార్క్ చాకోలేట్, చాకోరోకో, చాకో చిప్స్ వంటి 40రకాల ఫ్లేవర్స్‌తో చేసిన ఐక్‌క్రీమ్‌లు అమ్ముతున్నారు. ప్రతి ఐస్‌క్రీమ్ సింగిల్ స్కూప్‌కు 55గ్రాములు ఉన్నదానికి రూ.70వరకు తీసుకుంటున్నారు. దాదాపుగా అన్ని రకాల ఐస్‌క్రీమ్‌లకు ఇదే ధరను చెల్లించాల్సి ఉంటుంది. వాడల్లోకి వచ్చి అమ్మే ఐస్‌క్రీమ్‌లతో పోలిస్తే, వీటి ధర ఎక్కువగానే ఉన్నా, అందుకు తగిన టేస్ట్ ఉండేలా తయారు చేస్తున్నారు. ఐస్‌క్రీమ్ పార్లర్‌లోనే కూర్చుని, కబుర్లు చెబుతూ ఈ టేస్టీ ఐస్‌క్రీమ్‌లను తినేలా ఏర్పాట్లు చేశారు. వేసవి కావడంతో ఎండకు వెళ్లిన వారు, ఎక్కడ ఐస్‌క్రీమ్ పార్లర్ కనిపించినా, అక్కడికి వెళ్లి నచ్చిన ఐస్‌క్రీమ్‌ను తింటూ, వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

పండ్లు, డ్రైఫ్రూట్స్‌వే ఎక్కువ..

వేసవిలోనే ఎక్కువగా తింటారు



ఐస్‌క్రీమ్ పార్లర్‌ను ఏడాది మొత్తం అందుబాటులోనే ఉంచుతాం. కానీ వేసవి మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు ఎక్కువగా గిరాకీ ఉంటుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు వచ్చి కూర్చుని వారికి నచ్చిన ఐస్ తినేలా 40రకాల ఫ్లేవర్లలో అందుబాటులో ఉంచాం. పండ్లు, డ్రైఫ్రూట్స్, చాకోలేట్ ఫ్లేవర్లలో అందిస్తున్నాం.

– శ్రీధర్ బాబు, ఐస్‌క్రీమ్ పార్లర్ యజమాని

చాలా టేస్టీగా ఉంది....



వేసవికాలం కావడంతో ఎండ వేడికి చల్లగా ఉండే వాటిని తినడమో, తాగాలనో అనిపిస్తుంటుంది. ఐస్‌క్రీమ్‌లు నోట్లో వేయగానే కరిగిపోయి, శరీరానికి కాస్త ఉపశమనాన్ని ఇస్తున్నాయి. ఎన్నో రకాల టేస్టీగా ఉండే ఐస్‌క్రీమ్‌లను అప్పుడప్పుడూ ఇలా టేస్ట్ చేయడం చేస్తాను. రకరకాల పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో చేసిన ఐస్‌క్రీమ్‌లు, చాకోలేట్ ఐస్‌క్రీమ్‌లు టేస్టీగా ఉన్నాయి.

– నాగార్జున, మంచిర్యాల

మార్కెట్‌కు పోటెత్తిన ఎండు మిర్చి

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో ప్రతి శనివారం జరిగే మార్కెట్‌కు ఎండు మిర్చి పెద్ద మొత్తంలో అమ్మకానికి వచ్చింది. వేసవి కాలంలో ఎండు మిర్చి అమ్మకాలు ఎక్కువగా సాగుతుంటాయి. ఈ ఏడాది వేసవి ప్రారంభంతోనే మిర్చి మార్కెట్‌ను పోటెత్తడంతో, ప్రజలు మిర్చి కొనేందుకు తరలివచ్చారు. మిర్చి నాణ్యతను బట్టి రూ.240 నుంచి రూ.370 వరకు కిలో చొప్పున మార్కెట్‌లో మిర్చి అమ్మకాలు సాగాయి.

సునీతకు ఓయూ డాక్టరేట్



మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలకు చెందిన పెద్దపల్లి సునీతకు ఉస్మానియా యూని వర్సిటీ జంతుశాస్త్రంలో పీహెచ్‌డీను ప్రకటించింది. స్థానికంగా నివసించే పెద్దపల్లి సత్తయ్య, బాలమణి కుమార్తె సునీత విద్యాభ్యాసం సరస్వతీ పాఠశాల, జిల్లా పరిషత్ బాలిక హైస్కూల్ మంచిర్యాల, కొత్తగూడేం సింగరేణి కళాశాలలో ఇంటర్, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, నిజాం కళాశాలలో ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ జువాలజీ పూర్తి చేసింది. అనంతరం పీహెచ్‌డీ ఓయూ జంతు శాస్త్ర విభాగంలో అడ్మిషన్ పొంది చైర్‌పర్సన్, బోర్డు ఆఫ్ స్టడీస్, సీనియర్ ప్రొఫెసర్ జితేందర్‌కుమార్ నాయక్ పర్యవేక్షణలో అప్లికేషన్ ఆఫ్ ప్రోబయటిక్స్ ఇన్ కార్ప్ ఫిషెస్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు.

అధ్యక్షుడిగా రాజు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): చిత్రకళ ఆర్ట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా బొంకూరి రాజు(అమ్మా ఆర్ట్స్), ప్రధాన కార్యదర్శిగా ముల్కల్ల చిన్నయ్య(చిన్నా ఆర్ట్స్) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, సీనియర్ ఆర్టిస్ట్ సత్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యెర్రవెల్లి యాదగిరి, మైదం మల్లేశ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఏక్రగీవంగా ఎంపిక చేసి ప్రకటించారు.

క్లుప్తంగా

నేడు బెల్లంపల్లిలో దావత్ ఏ ఇఫ్తార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ సింగరేణి కళావేదికలో ఆదివారం సాయంత్రం రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున దావత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహిస్తుందని బెల్లంపల్లి బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ కమిటీ ప్రకటించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ముస్లింలు పాల్గొని ఇఫ్తార్ విందు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగులకు బస్సుపాస్‌ల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: మందమర్రి మున్సిపాలిటీలో ఈ నెల 17న ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగుల బస్ పాసుల పంపిణీ జరుగుతుందని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. అంగవైకల్యం 40శాతం పైన మూగా, చెవుడు, కంటి వారికి 100శాతం ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫైర్ సిబ్బంది ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న ఫైర్ అధికారులు

చెన్నూర్: పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం కొత్త బస్టాండ్ ప్రాంతంలో అగ్నిమాపక అధికారి రాజేందర్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణ చర్యలను ప్రదర్శించారు. అనంతరం అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

భీమారం: మండలంలోని బూర్గుపల్లి ప్రధాన రహదారిపై శనివారం జెడ్పీటీసీ భుక్యా తిరుమల తన సొంత ఖర్చుల(రూ.20వేలు)తో పోలీసుల ఆధ్వర్యంలో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఎస్సై సుధాకర్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై గట్ల సుధాకర్, జెడ్పీటీసీ తిరుమల మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని ఎస్సై సుధాకర్ సూచించారు.

అలరించిన ఫేర్‌వెల్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ కన్వెన్షన్ హాల్లో సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లీగల్ హ్యూమెన్ రైట్స్, ఆర్టీఐ టీపీసీసీ వైస్ చైర్మన్ కాంపెల్లి ఉదయ్‌కాంత్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ద్వారా ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్ ఉపాధ్యాయ, ప్రిన్సిపల్ తిరుపతి, రవీంద్రకుమార్, అధ్యాపక బృందం ఉన్నారు.

కృతజ్ఞత సభకి సెర్ప్ ఉద్యోగులు

భీమారం: హైదరాబాద్‌లో శనివారం సెర్ప్ ఉద్యోగులు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు మంచిర్యాల జిల్లా 120మంది సెర్ప్ ఉద్యోగులు తరలివెళ్లారు. మంత్రులు తన్నీరు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, సబితాఇంద్రారెడ్డి హాజరైన ఈ సభలో జిల్లా నుంచి తాము పాల్గొనడం సంతోషంగా ఉందని సీసీ దర్శనాల శంకర్ పేర్కొన్నారు.

డ్రాగన్‌ఫ్రూట్ తోటల పరిశీలన



భీమారం: మండల కేంద్రానికి చెందిన రైతులు శనివారం సిద్దిపేట ప్రాంతంలోని ములుగులోని ఉద్యానవన యూనివర్సిటీలో గల డ్రాగన్‌ఫ్రూట్ తోటలను పరిశీలించారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన బుక్యా రాజు ఇటీవలే తన సొంత భూమిలో డ్రాగన్‌ఫ్రూట్ తోటను పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి రైతులను తీసుకొని అక్కడ పెంచుతున్న విధానాన్ని పరిశీలించారు. వారి వెంట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేత



దండేపల్లిలో కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే

దండేపల్లి/లక్సెట్టిపేట: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లోని ముస్లింలకు ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కానుకలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. బతుకమ్మ పండక్కి చీరలు, క్రిస్మస్‌కు క్రైస్తవులకు, రంజాన్ పండక్కి ముస్లింలకు, ప్రభుత్వం కానుకలు అందిస్తుందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోను బీఆర్‌ఎస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. దండేపల్లిలో డీసీఎమ్మెఎస్ చైర్మన్ లింగన్న, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఎంపీటీసీలు శ్రీనివాస్, రాజన్న, ఉపసర్పంచ్ భూమన్న, తహసీల్దార్ హన్మంతరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, లక్సెట్టిపేటలో మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

‘అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం’

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాలు, మతాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పేద ముస్లింలకు ప్రభుత్వం నుంచి వచ్చిన రంజాన్ తోఫా(కానుకలు)ను శనివారం జిల్లా కేంద్రంలోని షాదీఖానాలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ముస్లిం కుటుంబాలు రంజాన్ పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సీఎం కేసీఆర్ ఏటా రంజాన్ పండుగకు తోఫాలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, తహసీల్దార్ రాజేశ్వర్, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముస్లిం కుటుంబాలకు శనివారం హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో రంజాన్ తోఫాలను ఎమ్మెల్యే దివాకర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొగిళి శ్రీనివాస్, జీవన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు కోటె సత్తయ్య, సందెల వెంకటేశ్, రామారావు, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, సర్పంచులు, ఎంపీటీసీలు, తహసీల్దార్ రాజలింగు పాల్గొన్నారు.

‘పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాల అమలు’

నస్పూర్: పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. సీసీసీ సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని ముస్లింలకు ఆయన రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్ మడిగ మల్లయ్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, నాయకులు హైమద్, గౌస్, మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత రత్న అవార్డుకు ఎంపిక



అవార్డు అందుకుంటున్న రాజేష్

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేష్‌కు దళిత రత్న అవార్డు వరించింది. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాజేష్ అవార్డు అందుకున్నారు.

మందమర్రి వాసికి దళిత రత్న పురస్కారం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన సునార్కర్ రాంబాబు దళితరత్న పురస్కారానికి ఎంపికయ్యారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. సేవా కార్యక్రమాలు, కళా రంగంలో రాణించినందుకు పురస్కారం లభించిందని తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు భద్రతెక్కడ?

- అనుమతి లేకుండా బయటకెళ్లిన విద్యార్థులు
- తీసుకొచ్చేందుకు తోటి విద్యార్థులను పంపిన ఉపాధ్యాయులు



విద్యార్థులను తీసుకువస్తున్న తోటి విద్యార్థులు

కాసిపేట: మండలంలోని రేగులగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో నలుగురు విద్యార్థులు అనుమతి లేకుండా బయటకు వెళ్లడంతో వారిని తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది వెళ్లాల్సి ఉండగా తోటి విద్యార్థులను పంపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆశ్రమ పాఠశాల నుంచి 6, 7తరగతులకు చెందిన నలుగురు విద్యార్థులు శనివారం మధ్యాహ్నం మండుటెండలో ఎవరికి చెప్పకుండా హాస్టల్ నుంచి బయటకు వెళ్లారు. దేవాపూర్ వెళ్లేందుకు రేగులగూడ గ్రామ శివారు నుంచి దేవాపూర్ ప్రధాన రోడ్డు ఎక్కి కోమటిచేను దాటారు. అనంతరం ప్రధాన రోడ్డు ద్వారా దూరం అవుతుందని సల్పాల వాగు ప్రాజెక్టు కట్ట మీద నుంచి వెళ్లి చింతగూడ మీదుగా వెళ్తుండగా, తోటి విద్యార్థులు పరుగెత్తుకుంటూ వెళ్లి వారిని తిరిగి కాలినడకన హాస్టల్‌కు తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో వారు వెళ్లిన విషయం తెలుసుకొని ఉపాధ్యాయులు ఇతర విద్యార్థులను పంపించడం, మిట్ట మధ్యాహ్నం రెండు, మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. చెరువు సమీపంలో, రోడ్డుపై విద్యార్థులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరిది అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులపై శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై డీటీడబ్ల్యూవో నీలిమను వివరణ కోరగా ప్రస్తుతం హెచ్‌ఎం అరుణ స్పాట్ వాల్యుయేషన్‌లో ఉందని, ఇన్‌చార్జి ఉన్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి కుద్దును వివరణ కోరగా కేవలం పాఠశాల ఇన్‌చార్జి బాధ్యతలు మాత్రమే అప్పగించినట్లు, హాస్టల్‌కు సంబంధించి అధి కారికంగా ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదని, హెచ్‌ఎం అరుణనే చూసుకుంటున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: 2023–24విద్యా సంవత్సరానికి గాను అర్హత గల షెడ్యూల్ కులాలు (ఎస్సీ) బాలబాలికల నుంచి హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్–బేగంపేటలో 2సీట్లు 1వ తరగతి ఇంగ్లీష్ మీడియం ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 2017 జనవరి 1నుంచి 2017డిసెంబర్ 31మధ్య జన్మించి ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ1లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు మించి ఉండరాదని, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం సంబంధిత తహసీల్దార్, మున్సిపాలిటీ నుంచి పొంది ఉండాలని, ఆదాయం, కుల ధృవీకరించి దరఖాస్తుకు జత పరుచాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుఫారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 17 నుంచి మే 1వరకు కార్యాలయంలో అందించాలన్నారు. 2కలర్ పాస్‌పోర్ట్ ఫొటోలు, ఒరిజనల్ సర్టిఫికెట్స్ జతచేసి దరఖాస్తులు సమర్పించాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు లాటరీ ప్రక్రియ ద్వారా ఎంపిక ఉంటుందని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి

లక్సెట్టిపేట: కుట్టుశిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండలంలోని చందారంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుశిక్షణ, నిరక్షరాస్యులకు అక్షరాస్యత కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. నిరక్షరాస్యతను నిర్మూలించాలని, చదువురాని వారికి చదువు నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల వయోజన విద్య ఇన్‌చార్జి అధి కారులు పురుషోత్తం నాయక్, రమేష్ రెడ్డి, ఎంపీపీ మంగ, జెడ్పీటీసీ సత్తయ్య, ఎంపీడీవో నాగేశ్వర్, ఎంఈవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



పాతమంచిర్యాల: తెలంగాణ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు శాఖ ఆధ్వర్యంలో కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం నిర్వహించే వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరాలను భవన నిర్మాణ రంగాల కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, కామన్ సర్వీస్ సెంటర్ వెల్‌నెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జిల్లా మేనేజర్ రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్మికశాఖ అధికారి రామ్మోహన్, భవన నిర్మాణ సంఘం పట్టణ అధ్యక్షుడు రామన్న, ఉపాధ్యక్షుడు సూరయ్య, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సింగరేణి కంపెనీ క్వార్టర్‌పై పడిన పిడుగు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 24డీప్ ఏరియా బస్తీలోని సింగరేణి కంపెనీకి చెందిన 13వ నెంబర్ క్వార్టర్ పక్కన ఉన్న కొబ్బరి చెట్టుపై శుక్రవారం అర్ధరాత్రి పిడుగు పడటంతో ఆ ఇంట్లో నివసిస్తున్న కుటుంబీకులు భయభ్రాంతులకు గురయ్యారు. పిడుగుధాటికి కంపెనీ క్వార్టర్‌లో ఉన్న విద్యుత్ ఉపకరణాలు, తీగలు చెడిపోయాయి. కొబ్బరి చెట్టుపై భాగంలో మంటలు వ్యాపించి క్వార్టర్ సిమెంట్ రేకుల మీదుగా ప్రసరించాయి. వెంటనే పొరుగున ఉన్న కొందరు గమనించి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న ఇప్పకాయల రమేష్ కుటుంబ సభ్యులను బయటకు తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పింది. రమేష్ కాసిపేట ఏజెంట్ కార్యాలయంలో ఫ్యూన్‌గా పని చేస్తున్నాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన వచ్చి మంటలు ఆర్పివేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: రాష్ట్రంలోని మహాత్మాజ్యోతిభాపూలే డిగ్రీ, జూనియర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో, అడ్మిషన్ కోసం ఎంజేపీ ఆర్‌జేసీ/ఆర్‌డీసీ సెట్ కోసం ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలు రాసిన విద్యార్థులు, దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిభాపూలే విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌జేసీ/ఆర్‌డీసీ సెట్ కోసం 16ఆదివారం ఆఖరు తేదీ అని తెలిపారు.

19న ఎంసీపీఐ(యూ)నేత గౌస్ వర్ధంతి

తాండూర్: దివంగత ఎంసీపీఐ(యూ)జాతీయ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ ద్వితీయ వర్ధంతి సభ, స్మారక స్తూపకావిష్కరణను ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యూ)జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్ శనివారం సమావేశం ఏర్పాటు చేసి పోస్టర్ ఆవిష్కరించారు. వరంగల్ జిల్లాలోని స్వగ్రామం కొత్తూరులో వర్ధంతి సభ జరుగుతుందని ఈ సందర్భంగా గౌస్ 51ఫీట్ల స్మారక స్తూపాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. పేద ప్రజల పక్షాన గౌస్ తుదిశ్వాసవీడే వరకు పోరాడారని గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి అనేక ప్రజా పోరాటాల్లో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. గౌస్ అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి, ప్రజలకు తీరనిలోటన్నారు. వర్ధంతి సభకు ప్రజలు, కామ్రేడ్స్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజశేఖర్, రాజేంద్రప్రసాద్, మెరుగు ప్రసాద్ పాల్గొన్నారు.

నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

నెన్నెల: మండలంలోని గంగారాం గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర నేతకాని రక్షణ సంఘం అధ్యక్షుడు కామెర శ్రీనివాస్‌ను ఆ గ్రామ ప్రజలు శనివారం శాలువా కప్పి సన్మానించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

మంచిర్యాలటౌన్: పాతమంచిర్యాలలోని 9వ వార్డులో 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నూతనంగా ఏర్పాటు చేయగా, శనివారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్ రాజన్న, కిషన్, తిరుపతి, విద్యుత్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మహాసభలకు వెళ్లిన ఐఎఫ్‌టీయూ నేతలు

శ్రీరాంపూర్: తిరుపతిలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జరుగుతున్న ఐఎఫ్‌టీయూ 7వ జాతీయ మహాసభలకు శ్రీరాంపూర్ నుంచి ఆ యూనియన్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. శనివారం మంచిర్యాల రైల్వే స్టేషన్‌కు చేరుకొని అక్కడి నుంచి తిరుపతికి వెళ్లారు.

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలి

దండేపల్లి: నాలుగేళ్ల ప్రొహిబిషన్ పీరియడ్ పూర్తయినందునా, తమను రెగ్యులర్ చేయాలని దండేపల్లి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ నెల 28లోగా తమను రెగ్యులర్ చేయకుంటే, విధులు బహిష్కరించి సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఎంపీడీవో మల్లేశంకు శనివారం సమ్మె నోటీస్ అందించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం నిర్ణయించిన ప్రొహిబిషన్ కాలాన్ని పూర్తి చేసిన తమను ఈ నెల 28వ తేదీలోగా రెగ్యులర్ చేయాలని లేనిపక్షంలో సమ్మె తప్పదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) స్పష్టం చేశారు. హాజీపూర్ మండల ఎంపీడీఓ అబ్దుల్‌హైకి శనివారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు హారిక, రాజమణి, స్వరూప, మల్లేశ్, సాయిరాం, గణేశ్, శ్రీనివాస్, ఉదయ్ ఉన్నారు.

కోటపల్లి: పంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని మండలంలోని జేపీఎస్‌లు ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజుకు వినతిపత్రం అందజేశారు. రాజశేఖర్, స్వర్ణ, సంతోశ్, వెంకటేశ్, తిరుపతి, వెంకటేశ్, తాజోద్దీన్, సదయ్య పాల్గొన్నారు.

అన్నదానం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీఓ రాధాకిషన్, ఆర్ఐ కిషన్ హాజరయ్యారు. ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.